## కామెడీ కథ

# శ్రీజ నవ్వుతోంది!

గలగలా... హాయిగా... నవ్వులోని ఆహ్లాదానికి ఆకారమన్నట్లుగా..అందాన్నంతా రాశిపోసినట్లుగా..వెన్నెలలోని తాజ్‌మహల్ ఆమె ముందు వెలవెలాపోయేటట్లుగా..రవివర్మకే అందని ఒకే ఒక అందమైనట్లుగా... శ్రీజ నవ్వుతోంది!

'నా కోరిక నెరవేరింది! నా ఆశ ఫలించింది!!

ఐ గాటిట్! ఐ గాటిట్!' గట్టిగా అరిచాడు యోగీంద్ర. వెంటనే-

'అబ్బా... ' బాధగా మూలిగాడు. కుడిచేతికి ఏదో గట్టిగా దెబ్బతగిలి, ఈ లోకంలోకి వచ్చాడు. గోడకి గుద్దుకున్న చెయ్యి చాలా నొప్పిగా అనిపించింది. అతను మంచం ప్రక్కన గచ్చుమీద ఉన్నాడు. టైము చూస్తే ఉదయం తొమ్మిదీ రెండు అయింది.

ఇంతవరకూ, గలగలా నవ్వుతున్న శ్రీజని చూసినది కలలోననే విషయం అర్థం కావడానికి అతనికి అట్టేసేపు పట్టలేదు. 'వండ్రఫుల్ కల!' అని సంతోషించాడు కొద్ది సెకన్లు. ఆ తర్వాత నీరసంగా నిట్టూర్చాడు.

'నీరజతో కాసిన పందెం గెలిచాననీ, అంతకుమించి... తన కోరిక నెరవేరిందనీ తను పొందిన ఆనందమంతా వట్టి కలేనన్నమాట! వా..' అనుకుంటూ ఆవేదనతో జుట్టు పీక్కున్నాడు. జుట్టు పీకిన ప్రాంతం, కుడిచేయి రెండూ కలుక్కుమన్నాయి. ఆ రెండింటిని మించిన వర్రీ ఏదో మనసులో కలుక్కుమంది. ఓటమేనా నాకు మిగిలింది! ఓటమిని అంగీకరించలేని అంతరంగం బావురుమంది.

'ఆహా... నా చెల్లికి ఇటువంటి ఫ్రెండ్ ఉండనేలా! ఉన్నది ఫో..ఆమె నాకు తటస్థపడనేలా? పడినదే ఫో... నాకు 'ఆ కోరిక' కలగనేలా! కలిగినదే ఫో... దానికి నేను దాసుణ్ణి కానేలా! అయితినే ఫో... దానిని నేను సాధించలేకపోనేలా! సాధించలేకపోతినే ఫో... నో నో... సాధించలేకపోడమన్నది కరక్టు కాదు. తనకి ఇంకొక అవకాశం, చివరి అవకాశం ఉంది. తను డిప్రెస్ కాకూడదు. రెట్టించిన ఉత్సాహంతో కార్యరంగంలోకి దిగాలి' దృఢంగా అనుకున్నాడు. డిప్రెషన్‌ను దూరం చేసి ఉత్తేజాన్ని పొందడానికి సులువైన మార్గం ఆచరణలో పెట్టాడు. 'అష్ట్హాష్ట్హా' గట్టిగా నవ్వడం మొదలుపెట్టేడు.

★★★

శ్రీజ ఎవరో..కోరికేవిటో..పందెమేమిటో అర్థంకాక అయోమయంగా ఉందికదూ? అవన్నీ అర్థం కావాలంటే, మీకు కొంత 'ఫ్లాష్‌బ్యాక్' చూపించాలి. ఐమీన్ చెప్పాలి. యోగీంద్ర అష్ట్హా ష్ట్హా...అని నవ్వుకుంటూ బాత్‌రూమ్‌లో దూరేడు కదా! అతను స్నానం చేసి రెడీ అయ్యేలోగా ఆ ఫ్లాష్‌బ్యాక్ మీకు చెప్తాను.

అదికాదండీ, అసలేమైందంటే...

దాదాపూ నెల రోజుల క్రితం ఒక రోజు సిటీ బస్ స్టాప్ ప్రక్కగా రోడ్డుమీద వెళ్తున్న యోగీంద్ర, 'అన్నయ్యా!' అన్న పిలుపుతో, స్లోలో వెళ్తున్న

## ఓ నవ్వు కథ

బండిని సడెన్‌బ్రేక్‌తో ఆపుచేసేడు. ప్రక్కకి తిరిగి చూసేడు. అతని చెల్లెలు నీరజ, 'బెంగుళూరు నుండి ఎప్పుడొచ్చావు? ట్రైనింగ్ ప్రోగ్రామ్ సక్సెస్‌ఫుల్‌గా పూర్తి అయినట్లేనా?' అంటూ పలకరించింది. దాదాపు ఆరు నెలల తర్వాత అన్నయ్యని చూసిన ఆనందం ఆమె ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ''ఆ..అంతా ఒ.కె. మీరంతా ఒ.కెనా? నేను మొన్ననే బెంగుళూరు నుండి వచ్చాను. వచ్చే ఆదివారం నీ ఫ్లాట్‌కి రావాలనుకున్నాను'' అంటూ చూపుపక్కకి మరల్చాడు.

''ఈమె నా త్రీ యిన్ వన్ నంబర్ 2, పేరు శ్రీజ!'' చెప్పింది నీరజ.

''యూ మీన్... పద్మజలాగా, ఫ్రెండ్ కం క్లాస్‌మేట్ కం రూమ్మేట్ అన్నమాట''

''హలో..'' అంది శ్రీజ మొఖంలో ఎటువంటి భావం లేకుండా,

'ముగ్ధమనోహర రూపమంటే ఇలాగే ఉంటుందేమో..' ఆమెనే చూస్తూ మనసులో అనుకున్నాడు యోగి.

''అదుగో మా బస్ వచ్చింది. మేం వెళ్తున్నాం. నెక్స్టు ఆదివారం మా ఫ్లాట్‌కి తప్పక రా అన్నయ్యా'' అంటూ ఫ్రెండ్‌తో కలిసి బస్ వైపు పరుగు తీసింది నీరజ.

★★★

నీరజ, యోగీంద్ర పిన్నికూతురు-యం.సి.ఎ. సెకండ్ ఇయర్ చదువుతోంది. ఆమె పేరెంట్స్ వేరే ఊళ్ళో ఉంటారు. అందువల్ల ఆమె ఫ్రెండ్స్‌తో కలిసి ఒక అద్దె ఫ్లాట్‌లో ఉంటున్నది. యోగీంద్ర, ఒక కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. అతని పేరెంట్స్ కూడా వేరే ఊళ్ళో ఉంటారు. అతను ఒక్కడే ఒక రెంటెడ్ గదిలో ఉంటున్నాడు. ఈజిట్ క్లియర్?

ఆదివారం రానే వచ్చింది!

ఉదయం పది గంటలవుతుండగా నీరజ ఫ్లాట్‌కి చేరుకున్నాడు యోగీంద్ర.

అన్నయ్యని ఆనందంగా ఆహ్వానించింది నీరజ. తర్వాత వాళ్ళు బావున్నారా, వీళ్ళు బాగున్నారా అనే కుశల ప్రశ్నలయ్యాయి. ఆ కొద్ది సేపటిలోనే యోగీంద్ర చాలాసార్లు లోపలికి దృష్టిసారించడం, కూర్చున్న సీటులో అసహనంగా కదలడం నీరజ గమనిస్తూనే ఉంది.

''ఔనూ నీరూ, నీ త్రీయిన్ వన్స్ కనబడరే! హౌ ఎబౌట్ పద్మజ?'' అడిగేడు యోగీంద్ర.

''వాళ్ళ పేరెంట్స్‌కి ఫోన్ చెయ్యడానికి ఎస్.టి.డి బూత్‌కి వెళ్ళేరు, శ్రీజ, పద్మజ. ఇప్పుడొస్తుంది కదా, పద్మ ఎలా వుందో నువ్వే చూడు! '' చెప్పింది నీరజ.

''మీ ఫ్రెండు శ్రీజ మీ కాలేజిలో కొత్తగా చేరిందా?'' యోగీంద్ర అడిగాడు.

''మొదటి నుండీ మా కాలేజ్‌లోనే చదువుతోంది. మా బ్యాచే. లాస్ట్‌సమ్మర్‌లో వాళ్ళ డేడీకి చెన్నై ట్రాన్స్‌ఫర్ అయింది. పేరెంట్స్ అక్కడికి షిఫ్ట్ అయ్యారు. అందుకని, శ్రీజ మాతోపాటు ఉంటానంది. అలా మేం ఇద్దరం ముగ్గురమయ్యాం''

''మీ ఫ్రెండ్ శ్రీజ చాలా అందంగా ఉందే!'' మెచ్చుకోలుగా అన్నాడు యోగి.

''అందంగా ఉండటమే కాదు, బ్రిలియంట్ కూడా. మా బ్యాచ్ టాపర్ ఆమె!''

''వెరీగుడ్. అటువంటి ఆమె నీ ఫ్రెండ్ కావటం నీ లక్!'' మనస్ఫూర్తిగా అన్నాడు యోగి. అందాన్ని చూసి ఆనందించటం, వర్త్‌ని అభినందించటం అతని నైజం.

''మీ ఫ్రెండ్‌ని చూసిన తర్వాత నాకు ఒక కోరిక బలంగా కలిగిందే!'' నెమ్మదిగా చెప్పాడు యోగి.

''కోరిక! కోరికేవిట్రా బాబూ!'' అయోమయంగా అనిపించింది నీరజకు.

ఎందుకంటే, 'పద్మజ తనకి అన్ని విధాలుగా నచ్చిందనీ, ఆమెనే తప్పక పెళ్ళి చేసుకుంటాననీ, యం.సి.ఎ పూర్తి అయిన తర్వాత పెద్దవాళ్ళతో

సంప్రదించి పెళ్ళి చేసుకునేంతవరకూ, ఈ విషయం పద్మతో సహా ఎవ్వరికీ చెప్పవద్దని ఆమెకు చెప్పేడు, బెంగుళూరు వెళ్ళేముందు. ఇప్పుడేమో..' ఆలోచిస్తోంది నీరజ.

''వినకూడని మాటేదో విన్నట్లు, ఏవిటే ఆ ఎక్స్‌ప్రెషన్! తీసెయ్, నీ మొఖం నుంచి ఆ ఎక్స్‌ప్రెషన్ పూర్తిగా తుడిచెయ్యి!'' శంకరాభరణంలో జెట్ స్పీడు సంగీతం మాస్టారు తన విద్యార్థినితో అన్నట్లుగా అన్నాడు యోగీంద్ర.


''ఇంతకీ ఆ కోరికేవిటో సెలవివ్వండి సోదరా'' కొంచెం వ్యంగ్యంగా అంది నీరజ.


''ఎంతో అందంగా ఉన్న శ్రీజ... గలగలా నవ్వుతుంటే ఇంకెంత అందంగా ఉంటుందోనని పించింది. ఆ ఆలోచన వచ్చిన తర్వాత, ఆమె గలగలా నవ్వుతుంటే చూడాలనిపించింది. ఆ కోరిక ఇంతింతై..వటుడింతై అన్నట్లు నాలో పెరిగిపోయింది.''

''ఓ..అదన్నమాట విషయం. లవ్‌స్టోరీ వినిపిస్తావేమోనని కంగారుపడ్డాను. కామెడీ కథన్నమాట!'' నవ్వుతూ అంది నీరజ.

''నేను నీకు డిఫరెంట్ లవ్‌స్టోరీలు విని పించే వాడిలా కనిపిస్తున్నానా? నా లవ్ స్టోరీ ఆల్‌రెడీ నీకు వినిపించేశాను కదా!'' అన్నాడుయోగీంద్ర.

''ఇట్స్ ఒ.కె. మైడియర్ జెంటిల్ మన్ బ్రదర్, కానీ పరాయి అమ్మాయిని నవ్వుతుంటే చూడాలని ఆశపడడం కూడా అంత సభ్యత అనిపించుకోదేమో!'' అంది నీరజ.





''వెన్నెల్లో తాజ్‌మహల్‌ని, పున్నమిరాత్రి నిండు జాబిలినీ, బోసినవ్వుల అందమైన పాపాయినీ చూసి ఆనందించడం ఏమాత్రం తప్పు కాదు, కదా! ఇదీ అంతే! ఔను, శ్రీజ చాలారోజులుగా నీకు ఫ్రెండ్ కదా. ఆమె గలగలా నవ్వడం చాలాసార్లు చూసే ఉంటావు కదా, గలగలా నవ్వేటప్పుడు ఆమె చాలా చాలా అందంగా ఉంటుంది కదూ, మల్లెల వాసన వెదజల్లే తాజ్‌మహల్ లాగా..సంపెంగ వాసన వెదజల్లే కలువలా..ఇంద్రధనుసు చీరె ధరించిన వెన్నెల వధువులా..'' ఏదో తన్మయత్వంతో అతని ఊహాలోకంలో శ్రీజను తలుచుకుంటూ అడిగేడు యోగి.

''శ్రీజ గలగలా నవ్వడమా! ఆమె అలా నవ్వడం నేనింతవరకూ చూడలేదురా!''

''అదేంటి?'' ఆశ్చర్యంగా అడిగేడు యోగి.

''ఔన్రా..ఆమె నవ్వడమే తక్కువ. నవ్వినా పెదవులు బిగించి, కొంచెంగా సాగదీసినట్లు మాత్రం నవ్వుతుంది. ఆమె నోరు తెరిచి, అహ్హాహ్హాహ్హా అంటూ గలగలా నవ్వడం నేను ఇంతవరకూ చూడలేదు'' చెప్పింది నీరజ.

యోగీంద్రకి చాలా ఆశ్చర్యంగా అనిపించింది.

''మీరూ... కాలేజీ అమ్మాయిలు ఏవేవో కబుర్లు చెప్పుకుని తెగ నవ్వేస్తుంటారుకదే!''

''ఆమె అలా నవ్వదురా!''

''కార్టూన్స్ చూసినా, కామెడీ పిక్చర్స్ చూసినా కూడా నవ్వదా?''

''చార్లీ చాప్లిన్ పిక్చర్స్ చూసినా ఆమెకి అంతగా నవ్వు రాదట, ఒకసారి చెప్పింది.''

''అయితే నీ ఫ్రెండ్‌కి సెన్సాఫ్ హ్యూమర్ లేద

జి. అచ్చాయమ్మ

న్నమాట!''

''అలా అనుకోడానికి వీల్లేదురా. మంచి జోక్స్ కట్ చేస్తుంది. తను చదివిన జోక్స్ చెప్తుంటుంది. మేము నవ్వుతుంటే తను మామూలుగా ఉంటుంది.''

''అయితే ఎక్కడుందంటావ్ మతలబు! ఆ... దంతాల ప్రాబ్లమేమోనే! నాకూ, చిన్నతనంలో ముందు పళ్ళు ఊడిపోయి త్రొర్రి అయింది. నోరు తెరిచి నవ్వితే అది అసహ్యంగా కనిపిస్తుందేమోననే భయంతో, నవ్వు వచ్చినా బలవంతంగా ఆపుకునేవాణ్ణి. నోరు తెరిచి హాయిగా, ఫ్రీగా నవ్వే వాళ్ళని చూస్తే, నాకు చాలా బాధగా ఉండేది, నేనూ అలా నవ్వలేకపోతున్నందుకు! మీ ఫ్రెండ్ పరిస్థితి కూడా అటువంటిదేనేమో!''

''అబ్బా... అల్లాంటిదేం కాదురా. ఆమె బ్రష్ చేసుకునేటప్పుడు చూసేను. ఆమె పళ్ళు అందంగానే ఉంటాయి. టూత్‌పేస్ట్ మోడల్‌కి ఉన్నట్లు.

''నేను ఆమెని ఎలాగైనా అహ్హహ్హహ్హా అంటూ నవ్వించి తీర్తాను. నా కోరిక నెరవేర్చుకుంటాను'' దృఢంగా అన్నాడు యోగీంద్ర.

''ఎందుకొచ్చిన టైం వేస్టు పన్లురా అన్నయ్యా! ఆ టాపిక్ ఇంతటితో వదిలెయ్!'' సలహా యిచ్చింది నీరజ.

''నా మనసులోకి ఏదైనా ఒక ఆలోచన వచ్చిందంటే దాన్ని సాధించి తీర్తాను. ఆ విషయం నీకూ తెల్సు కదా?''

''అందుకే గదా మన ఫేమిలీలో నిన్ను 'మంగయ్యా' అంటుంటారు'' వంతపాడింది నీరజ.

అన్నయ్య పట్టిన సంతం వదలడని ఆమెకి తెలుసు.

''నువ్వు నాకు కొంచెం హెల్ప్ చెయ్యాలి రా నీరూ..'' చెల్లెల్ని ముద్దుగా అడిగేడు.

''ముందు మీ ఫ్రెండ్ దగ్గర నాకొక మంచి ఇమేజ్... అదే నా ఒరిజినల్ ఇమేజ్ క్రియేట్ చెయ్యాలి!''

''దాని గురించి నువ్వేమీ వర్రీ అవ్వక్కర్లేదు. కొద్దిసేపు చూసిందంటే, ఎవరు ఎలాంటివారో కనిపెట్టేస్తుంది ఆమె''

''ఈ విషయం మన ఇద్దరి మధ్యే ఉండాలి. నేను మీ రూమ్‌కి వచ్చినప్పుడు ఆమె ఏదో చదువుకుంటూనో, పనిచేసుకుంటూనో ఉండకుండా మనతోపాటు కూర్చునేలా చూడాలి. నా కామెడీ కథని పాలముంచినా, నీళ్ళల్లో ముంచినా... అదే నీట ముంచినా నీదే భారం'' అన్నాడు యోగి.

''సరే, కానీ నా షరతులు కొన్నింటికి నువ్వు ఒప్పుకోవాలి?''

''ఏమిటవి?'' అడిగేడు యోగీంద్ర.

''ఆమెని నవ్వించడానికి ఆమె మీద చక్కిలిగింతలు ప్రయోగించకూడదు. నంబర్ టు నువ్వు తరచూ మా రూమ్‌కి వచ్చి మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యకూడదు. వచ్చే ఆదివారం నుండి, రోజుకి ఒక గంటచొప్పున నాలుగు ఆదివారాలు మాత్రమే నీకు టైము. ఆ తర్వాత ఆ విషయం అంతటితో వదిలెయ్యాలి. నంబర్ త్రీ- ఈ విషయంలో నువ్వు సక్సెస్ కాకున్నా దాన్ని నువ్వు స్పోర్టివ్‌గా తీసుకోవాలి. నంబర్ ఫోర్ నువ్వు విజయం సాధిస్తే, మా ముగ్గురికీ మంచి పార్టీ ఇవ్వాలి'' మూసిన చేతి నుండి ఒక్కో వేలు తెరుస్తూ ఒక్కొక్క పాయింటు చెప్పింది నీరజ.

''ఓ.కె.'' చెప్పేడు యోగీంద్ర.

''ఉండు, నీకు మంచి టీ చేసి తీసికొస్తాను'' అంటూ లోపలికెళ్ళింది నీరజ.

నీరజ టీ తీసికొచ్చి అందించింది.

పద్మజ, శ్రీజ బైటి నుండి వచ్చారు. హాయ్...లతో పలకరించారు అమ్మాయి లిద్దరూ యోగీంద్రను.

''హాయ్.. సాల్వెంట్స్..'' అన్నాడు యోగీంద్ర.

యోగీంద్రనీ, నీరజనీ మార్చిమార్చి చూసింది పద్మజ, యోగీంద్ర భావమేమిటో అర్థంకాక.

''యస్! డు యు వాంట్ ఎనీ సొల్యూషన్?'' శ్రీజ స్పాంటేనియస్ సమాధానానికి ఆమె వైపు మెచ్చుకోలుగా చూసేరు యోగీంద్ర, నీరజ.

యోగీంద్ర అన్నదానికి అర్థమేమిటన్నట్లు..కళ్ళతోనూ, చేతితోనూ సంజ్ఞ ద్వారా ప్రశ్నించింది శ్రీజను పద్మ.

''వాళ్ళ చెల్లి 'నీరు' కదా. ఆమెతో కలిసిపోయిన మనం 'సాల్వెంట్స్' అన్నమాట'' వివరించింది శ్రీజ.

ఓ..అంటూ నవ్వేసింది పద్మ. జత కలిపేరు యోగీంద్ర, నీరజ.

శ్రీజని నవ్వించే ప్రయత్నంగా...కవ్వించడానికి ప్రయత్నించిన యోగి, ''షార్ప్'' అంటూ శ్రీజకి కాంప్లిమెంట్ ఇచ్చాడు.

'చూసేవా నా ఫ్రెండ్!' అన్నట్టు అన్నయ్య వైపు ఒక చూపు విసిరింది నీరు.

'చాలా షార్ప్ ఈమెని చాలా జాగ్రత్తగా డీల్ చెయ్యాలన్నమాట' మనసులోనే అనుకున్నాడు యోగీంద్ర.

★★★

శ్రీజను 'నవ్వించడం' ఒక కోరికగా మొదలైంది. ఒక ఛాలెంజ్‌గా కూడా అనిపిస్తుంది యోగికి. ఒకరిని పెద్దగా నవ్వించే హాస్యం పుట్టించాలంటే, ఏమి చెయ్యాలో ఆలోచించాడు. 'సినిమాలలో కామెడియన్ల హాస్యానికే నవ్వ'ని ఆమెని, చేష్టలతో నవ్వించ పూనుకోవడం హాస్యా

## మనసంతా ఆనందం

**తెలుగు చలనచిత్ర రంగంలో హీరోయిన్‌గా ఎవరికి ఎప్పుడు ఎలాంటి అవకాశం వస్తుందో తెలియదు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్ చదువుతున్న ఆర్జూ గోవిత్రకర్ అనే అమ్మాయిని 'మనసుతో..' చిత్రంలో ఆకాష్ సరసన హీరోయిన్‌గా నటించే అదృష్టం వరించింది. 'ఈ చిత్రకథ, నా పాత్ర నచ్చడంతో నేను హీరోయిన్‌గా 'మనసుతో..' చిత్రంలో నటించడానికి ఒప్పుకున్నాను' అని మనసంతా ఆనందంతో చెప్పింది.** -శ్వేత



స్పదం. ఇక మాటలతోనే నవ్వించాలి. అంతంత మాత్రపు హాస్యానికి ఆమె నవ్వదు కాబట్టి, టాప్ జోక్స్‌తో ఆమెని నవ్వించాలి అనుకున్నాడు- అప్పటి నుండి. ఫ్రెండ్స్ దగ్గర అడిగి తీసుకుని, లైబ్రరీకి వెళ్ళి జోక్స్ బుక్స్ తీసుకుని చదవడం మొదలుపెట్టేడు. అంతక్రితం చిన్న జోక్‌ని కూడా ఎంజాయ్.చేసే యోగి, ఇప్పుడు శ్రీజని దృష్టిలో పెట్టుకుని చదువుతుండటంతో ఎన్నో జోక్స్ చదివినా ఏవీ అప్పాహ్హాహ్హా..అంటూ నవ్వించేవి అనిపించల్లేదు. ఎన్ని బుక్స్ తిరగేసి, వాటిలో బెస్ట్ అనిపించినవి నాలుగు సెలక్టు చేసుకుని నీరజ వాళ్ళ ఫ్లాట్‌కి వెళ్ళేడు ఆ మొదటి ఆదివారం.

యోగీంద్ర వెళ్ళేసరికి అమ్మాయిలు ముగ్గురూ హాల్లోనే ఉన్నారు. పలకరింపుల తర్వాత కబుర్లలో పడ్డారు. కబుర్లు చెప్తూ చెప్తూనే మన జీవితంలో నవ్వు యొక్క ప్రాముఖ్యాన్ని గురించి చెప్పడం మొదలుపెట్టేడు యోగీంద్ర.

''గాలి పీల్చుకోవడం ఎలా ఖర్చులేని పనో, నవ్వడం కూడా ఖర్చులేని పనే! హాయిగా నవ్వుకోవడం ఆనందానికి మార్గం. బ్రతకడానికి అన్నిటితోపాటు నవ్వు కూడా అవసరమని నేటి పరిశోధకులు తెలియజేస్తున్నారు. అందుకే ఇన్హిబిషన్స్ ఏమీలేకుండా హాయిగా నవ్వడం అలవాటు చేసుకోవాలి అందరూ!''

''కొంపదీసి, మీరు లాఫింగ్ క్లబ్ ప్రెసిడెంటా?'' అడిగింది పద్మ.

''ఏదీ మళ్ళీ అడగండీ!'' చెప్పేడు యోగీంద్ర. రెండు సెకన్ల ఆలోచనతో అతని భావం గ్రహించింది పద్మ. హహ్హహ్హా అని నవ్వుతూ ''కొంపదీసి..మీరు కానీ..అప్పట్లో లాఫింగ్ క్లబ్ ప్రెసిడెంటా?'' అడిగింది నవ్వుతూనే.

ఆమె అభినయాన్ని చూసి యోగీంద్ర, నీరజ కూడా జత కలిపేరు నవ్వుని.

''దటీజ్ ద స్పిరిట్'' నవ్వుతూ అన్నాడు యోగీంద్ర.

''మీరు మరీ చెప్తున్నారు. నవ్వు గురించి మాట్లాడాలంటే లాఫింగ్ క్లబ్ మెంబరో ప్రెసిడెంటో అవ్వాలేంటండీ'' యల్.బి.శ్రీరామ్‌ని అనుకరిస్తూ అని శ్రీజ, అందరూ ఫక్కున నవ్వేరు.

''హాయిగా నవ్వగలిగినవాడు భోగి, కాస్త నవ్వగలిగిన వాడు యోగి..అస్సలు నవ్వని వాడు రోగి! అన్నారు ఒక హాస్యరచయిత'' చెప్పేడు యోగి.

''యోగి కూడా హాయిగా, బాగానే నవ్వుతున్నాడు కదా!'' యోగిని చూపిస్తూ అంది శ్రీజ.

''ఈ యోగి, పేరుకే యోగి..అసలైన భోగి'' అంది నీరజ నవ్వుతూనే.

''ఔనూ..ఇందాకటి నుండి చూస్తూన్నానూ. మేమంతా గలగలా నవ్వుతూనే ఉన్నాం. మీరు మాత్రం నవ్వట్లేదు!'' అడిగాడు యోగి, శ్రీజని.

''గలగలా నవ్వించటం, నవ్వేవాళ్ళని చూసి సైలెంట్ లాఫ్‌తో ఎంజాయ్ చెయ్యడం నా హాబీ. బట్, ఐయామ్ నాట్ యు, ఐమీన్ యోగి'' అంటూ లేచి వెళ్ళిపోయింది శ్రీజ.

★★★

రెండవ ఆదివారం..

సమయం సుమారు పది గంటలు.

నీరజ వాళ్ళు ముగ్గురూ హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

''సారీ టు డిస్టర్బ్ యు'' అంటూ రంగప్రవేశం చేసేడు యోగీంద్ర.

''మమ్మల్ని డిస్టర్బ్ చేసే అవకాశం మీకు ఇవ్వకూడదని, మేమే ఆల్‌రెడీ చాలా డిస్టర్బ్‌డ్‌గా ఉన్నాం'' చెప్పింది శ్రీజ.

''వాట్ హేపెండ్?'' కంగారుగా అడిగేడు యోగీంద్ర.

## ప్రేమా! ప్రేమా!

**అందంతోపాటు చక్కని నటన కలిగిన ప్రేమ ఎందుకో గానీ తెలుగులో అంతగా నిలబడలేకపోయింది..'దేవీ నాగమ్మ' చిత్రంలో నాగదేవతగా అద్భుత నటన ప్రదర్శించిన ప్రేమ ఇప్పుడు కన్నడంలో బిజీ నటి. అంతేకాదు, తన పేరుతోనే అంటే 'ప్రేమ' అనే టైటిల్‌తో ఓ కన్నడ చిత్రంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది ప్రేమ. ఇందులో ప్రముఖ హిందుస్తానీ సంగీత విద్వాంసుడు, అంధుడైన షిమోగ వేణుగోపాల్ తొలిసారిగా పాడడం విశేషం.**

-మానస



''అదే..మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యడానికి మీరు వచ్చే టైమైంది కదా, మీరెలానూ వచ్చి మమ్మల్ని ఎలానూ డిస్టర్బ్ చేస్తారు కాబట్టి..ముందే, మేమే డిస్టర్బ్‌డ్‌గా ఉంటే..మీరెంత డిస్టర్బ్ చేసినా..మేము డిస్టర్బ్ కాము కదా అని'' శ్రీజని మధ్యలోనే అడ్డుకుని

''అబ్బా.. ఆపవే అమ్మ తల్లీ!'' అంది నీరజ.

పద్మ టీ తీసికొచ్చి అందించింది యోగీంద్రకు.

''చాలా థేంక్స్ పద్మజ'' అంటూ అందుకున్నాడు.

''ఏదో అనడానికి నోరు తెరవబోయిన శ్రీజను చూసి, మా అన్నయ్యను ప్రశాంతంగా టీ త్రాగనివ్వవే'' అంది నీరజ.

టీ త్రాగి కప్పు ప్రక్కన పెట్టి, చెప్పడం మొదలుపెట్టేడు యోగీంద్ర.

''ఇప్పుడు మిమ్మల్ని ఒకటి అడుగుతాను. మీరు సమాధానం చెప్పాలి''

''ఒ.కె. ట్రై అవర్ లెవెల్ బెస్ట్'' అంది నీరజ.

''బాంబులు, టపాసులు కావవి..

కానీ, పేలతాయి ఒకసారి...

కురిపిస్తాయి కనిపించని జల్లులు

పండిస్తాయి కోతకిరాని పంటలు..ఏమిటవి?'' అడిగేడు యోగి.

ఎవరికి వాళ్ళు, తామే ముందు చెప్పి క్రెడిట్ కొట్టెయ్యాలని ముగ్గురమ్మాయిలు తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

ఒకటి..రెండు..మూడు..నాలుగు..అయిదు..ఆరు..ఏడు... సెకన్లముల్లు కదులుతోంది.

''పదార్థమన్నది లేకున్నా

సదాలే ఇంధనంగా

పేలేది 'జోకు'

కురిపిస్తుంది

హాస్యపు

జల్లులు

పండిస్తుంది నవ్వుల పంటలు?'' చెప్పింది శ్రీజ.

''వా..వా..'' ఆనందంతో చప్పట్లు కొడ్తూ, ఆనందాన్ని వ్యక్తం చేసేరు నీరజ, పద్మ.

''మా అన్నయ్య దగ్గర నా పరువు దక్కించావే'' స్నేహితురాలికి షేక్‌హేండ్ ఇస్తూ అంది నీరజ.

''చూసేరా, చిటికెలో చెప్పేసింది మా ఫ్రెండ్'' యోగీంద్రతో అంది పద్మ.

''కంగ్రాట్స్ శ్రీజ'' అభినందించాడు యోగీంద్ర.

ఆ తర్వాత చెప్పడం మొదలుపెట్టేడు. ''త్వరలో నేనొక జోక్స్ కాంపిటీషన్‌కి వెళ్తున్నాను. దానికి నేను జోక్స్ గేదర్ చేస్తున్నాను. వాటిని మీకు వినిపిస్తాను. దానివలన, అవి ఎంత బాగా పేల్తాయో నాకు తెలుస్తుంది. నేను చెప్పే జోక్స్ విని, మీరు నాకు సహకరించాలని ప్రార్థన''

''ఇస్తాం--ఇస్తాం'' అంది పద్మ.


''ఏవిటే ఇచ్చేది?'' అడిగింది నీరజ.

''సహకారం ఇస్తాం. సహకరిస్తాం అన్న మాట'' పద్మ అంది.

''మరి ఇక ఆలశ్యం ఎందుకు..వదులురా అన్నయ్యా, నీ జోకుల బాకులు''

గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టేడు యోగి.

............



## మనసు మార్చుకున్న సొనాలీ

తెలుగులో ఓ వెలుగు వెలుగుదామనుకుని వచ్చిన కుర్ర హీరోయిన్ సొనాలీ జోషీకి 'సుబ్బు' చిత్రం షాక్‌తో తెలుగు రంగానికి గుడ్‌బై కొట్టేసి ముంబాయి ఫ్లైట్ ఎక్కబోతుంటే డైరెక్టర్ గోనంగి సుబ్బారావు తమ చిత్రంలో నటించమని అడిగితే మనసు మార్చుకుని ఆ సినిమాని ఒప్పేసుకుందిట. తెలుగులో అంతా చెడే కాదు, మంచి కూడా వుంది. అందుకే తెలుగులో నటించాలని తిరిగి నిర్ణయం మార్చుకున్నాను- అంటోంది సొనాలీ జోషీ. -శ్వేత

............

............

ఒకదాని తరువాత ఒకటి మూడు జోకులు చెప్పేడు. నీరజ, పద్మ జోక్స్‌ని బాగానే ఎంజాయ్ చేసేరు. వాళ్ళు మనస్ఫూర్తిగా బాగానే నవ్వేరు. శ్రీజ సంగతి మామూలే. శ్రీజని చూడనట్లుగా ఉన్నా, శ్రీజని కంటికొసల నుండి గమనిస్తూనే ఉన్నాడు యోగి.

''కాంపిటీషన్‌లో చెప్పేంత గొప్పగా అయితే లేవీ జోక్స్. ఇంకొంచెం మంచివి ట్రై చేయండి. నాకు కొంచెం పనుంది వెళ్తాను'' అంటూ లేచి లోపలికి వెళ్ళిపోయింది శ్రీజ.

★★★

మరి ఇంకొక వారం ఇదే విధంగా గడిచింది. ఇక అతనికి ఒకే ఒక్క అవకాశం మిగిలి ఉంది. ఎలాగైనా విజయం సాధించాలని పట్టుదలగా ఉందతనికి.

ఎన్నో జోక్స్ బుక్స్ చదువుతున్నాడు. టి.వి. ఛానల్స్‌లో జోక్స్ చూస్తున్నాడు. ఫ్రెండ్స్‌ని, కొద్దిగా పరిచయమైనవాళ్ళనీ, చివరికి సిటీబస్‌లో ప్రక్కసీటులో కూర్చున్న వాళ్ళనీ..మీకు తెలిసిన మంచి జోక్స్ చెప్పండి- అని అడుగుతున్నాడు.

'లెట్ ద నోబుల్ థాట్స్ ఫ్రం ఆల్ సైడ్స్' అన్నట్లు హ్యూమరస్ జోక్స్ కోసం పరి పరివిధాల ప్రయత్నిస్తున్నాడు. ఆ ప్రయత్నంలో భాగంగానే నిన్న రాత్రి చాలా పొద్దుపోయే వరకూ మెలకువగా ఉండి తెల్లవారు ఝామున ఎప్పుడో నిద్రలోకి జారుకున్నాడు.

అదండీ విషయం.

అడుగో యోగీంద్ర రెడీ అయిపోయాడు. రూమ్‌కి తాళం వేస్తున్నాడు. ఛలో,, హమ్ భీ చలేంగే ఉస్ కే సాత్!

పాపం యోగీంద్ర..విష్ హిమ్ ది బెస్ట్.

★★★

''రా అన్నయ్యా వెల్కం'' అని నోటితో ఆహ్వానిస్తూ, ఇది నీకు ఆఖరి అవకాశం అన్నట్టు నొసలు పైకి అని, కళ్ళతో నవ్వింది నీరజ.

'ఆహా..ఈ ఆడవాళ్ళు ఎన్నెన్ని ఫీలింగ్స్ ఒక్కసారే అభినయించగలరూ..' అనుకున్నాడు మనసులో.

''ఏరా అన్నయ్యా, స్వీటు తింటావా, హాటు తింటావా?'' యోగీంద్ర కూర్చున్న తర్వాత నర్మగర్భంగా అడిగింది నీరజ.

''అదేంటి అలా అడుగుతావు? స్వీటు, హాటు రెండూ తింటారు'' అంది పద్మ.

''పెప్సీయాడ్‌లో మాట్లాడమని అమితాబ్‌కి ఫోనిచ్చినట్లు ఇచ్చి, వెనక్కి తీసుకుని, బచ్చన్ బోల్ రహాహై'' అన్నట్లుంది మీ తంతు'' అన్నాడు యోగి.

నీరజ, పద్మ ఇద్దరూ పెద్దగా నవ్వారు.

ప్లేటులో రెండు రకాల స్వీట్లు, హాటు పెట్టుకొచ్చి అందించింది శ్రీజ, ''మీ కోసమే వెయిట్ చేస్తున్నాం'' అంటూ.

''గత నాలుగు వారాలుగా ఈ టైముకి వస్తున్నాను కదా. నా విజిట్‌కి అలవాటు పడినట్లున్నారు'' అన్నాడు యోగి ఆనందపడిపోతూ.

''అబ్బే అది కాదండీ ఒక నాలుగు వారాలు మీరు మా రూమ్‌కి వచ్చిన టైములో, తనతో పాటు మేము కూడా మీకు కంపెనీ ఇస్తే, మాకు జబర్దస్త్ పార్టీ ఇస్తానంది మా దోస్త్ నీరజ. ఇది లాస్ట్ వీక్ కద. అదన్నమాట కత!'' చెప్పింది శ్రీజ.

తల గోక్కుంటూ ఇబ్బందిగా చూసింది నీరజ.

''తీసికోండి. కాజా చాలా బావుంది'' అంటూ టాపిక్ మార్చింది పద్మ.

కొద్ది నిమిషాలు వేరే టాపిక్కు మీద నడిచాయి కబుర్లు.

''ఔనూ..ఈవారం జోక్స్ సెషన్ లేదా?'' అడిగింది పద్మ.

''లేకే, హియర్ ఆర్ ఎ ఫ్యూ జోక్స్ ఫర్ యు'' అన్నాడు యోగీంద్ర

''నొ..నొ..ఇట్స్ ఫర్ యు'' అంది శ్రీజ.

''వై నాట్ ఫర్ యు'' రెట్టిస్తూ అడిగేడు యోగీంద్ర.

''అవి మీరు సేకరించింది వేరే చోట వినిపించడానికి కదా?'' పంతంగా అడిగింది శ్రీజ.

''కానీ వాటిని మీరు కూడా ఎంజాయ్ చేస్తున్నారు కదా!'' అంతే పంతంగా అన్నాడు యోగి.

''స్టాప్ ప్లీజ్. యోగిగారిని జోక్స్ చెప్పనివ్వవే తల్లీ. మీరు చెప్పండి యోగీంద్ర'' అంది పద్మ.

''నేను చెప్పనండి, సారీ'' అన్నాడు యోగీంద్ర గంభీర ముద్రతో.

''మంచివాడు మా అన్నయ్యా. మా మాటే వింటాడోయీ..కోపం మాని తాపం మానీ'' పాట మొదలుపెట్టింది నీరజ.

ఉలిక్కిపడి పద్మవైపు చూసేడు యోగి. నీరజతో ఆమె కూడా గొంతు కలిపితే ఇంకేమైనా ఉందా! ఆ ప్రమాదాన్ని నివారించడానికి వెంటనే-

''ఒ.కె. చెప్తాను'' అన్నాడు.

''చూసేవా పాటల్తో పన్లు ఎంత త్వరగా జరుగుతాయో! అందుకే సినిమాలలో అలా పాటలు పాడతారు'' సీరియస్‌గా పద్మవైపు చూస్తూ అంది నీరజ.

పద్మ, నీరజ కలిసి హాయిగా నవ్వేరు. కొద్ది సెకన్లు యోగీంద్ర కూడా హి..హి అన్నాడు.

తర్వాత హాస్య రచయితలకు మనసులోనే నమస్కరించుకుని...గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టేడు యోగీంద్ర.

''దాదాపూ పది పన్నెండు సంవత్సరాల వయస్సున్న అబ్బాయిలు అదే స్కూలు పిల్లలు, ఇద్దరు తమ గురించి గొప్పలు చెప్పుకుంటున్నారు.

అందులో ఒకడు చెప్పేడు గొప్పగా, సూయజ్ కెనాల్ ఉంది తెల్సుకదా. దాన్ని మా నాన్నే తవ్వాడు? రెండవ వాడు చెప్పేడు, ఆహా..అలాగా! డెడ్‌సీ ఉంది కదా, దాన్ని మా నాన్నే చంపేడు!''

పద్మ నీరజ ఒక్కసారే నవ్వేరు. నైస్ జోక్ అంటూ.

నవ్వులు సద్దుమణిగిన తర్వాత, రెండవ జోక్ చెప్పడం మొదలుపెట్టేడు యోగీంద్ర.


''దాదాపూ ఒక ఏడాది క్రితం పెళ్ళి చేసుకున్న ఒక జంట, ఒక బార్ కం రెస్టారెంట్‌కి వెళ్ళేరు. అక్కడ ఒక టేబిల్ దగ్గర కూర్చున్నారు. వారికి దగ్గర్లోనే, ఒక టేబిల్ దగ్గర కూర్చుని 'తాగుతున్న' ఒక వ్యక్తిని చూపించి, భార్య భర్తతో చెప్పింది, మొదట నన్ను అతనికి ఇద్దామనుకున్నారు మా వాళ్ళు. తర్వాత, ఆ సంబంధం ఒద్దనుకుని కేన్సిల్ చేసేరు. అప్పటి నుండి అతను అలా తాగుతున్నాడు.''

''వావ్..ఏడాది నుండీ సెలబ్రేట్ చేసుకుంటున్నాడన్నమాట!'' అన్నాడు భర్త.

జోక్ బాగానే పేలింది. సారీ..పద్మ, నీరజల దగ్గరే.

నీటిలో పడ్డ బాంబులా, శ్రీజ దగ్గర ఈ జోక్ కూడా పేలలేదు.

జుట్టు పీక్కోవాలనిపించింది యోగీంద్రకు. అంతలోనే..మిణుకుమిణుకు మంటూ ఒక చిన్న ఆశ..మిగిలి ఉన్న ఇంకొక జోక్ రూపంలో! అది కూడా పేలక పోతే..డిసపాయింట్‌మెంట్‌ని ఎదుర్కొనడానికి మెంటల్‌గా ప్రిపేరవుతూనే...ఇంకొక జోక్ చెప్పడం మొదలుపెట్టేడు యోగీంద్ర.




అమెరికాలో ఉంటున్న ఒక ఇండియన్, ఫ్రం ఆంధ్రప్రదేశ్..ఒకరోజున..ఒక గ్రేవ్‌యార్డు ప్రక్కన ఉన్న రోడ్డు మీద కారులో వెళ్తున్నాడు. యధాలాపంగా, గ్రేవ్‌యార్డులోకి దృష్టిసారించిన ఆయనకి, అక్కడి ఒక దృశ్యం అమిత ఆశ్చర్యానికి గురిచేసింది. సడెన్ బ్రేక్‌తో కారు ఆపుచేసేడు. కారు దిగి..నడుచుకుంటూ గ్రేవ్‌యార్డులోకి వెళ్ళేడు. అక్కడ, ఒక స్త్రీ ఒక సమాధి దగ్గర కూర్చుని ఆ సమాధిని చేతి విసనకర్రతో విసురుతోంది. ఆమె దగ్గరికి వెళ్ళి, ఈయన ఆమెనుద్దేశించి అడిగేడు, ''మేడమ్ ఈ సమాధి ఎవరిది?'' అని, ''నా భర్తది'' ఆమె చెప్పింది. అప్పుడు ఆయన, ఆమెకి ఎంతో గౌరవంతో నమస్కరించి అన్నాడు. ''మేడమ్, మా దేశంలో కూడా ఎందరో మహాపతివ్రతలున్నారు. భర్తకి ఎంతగానో సేవలు చేస్తారూ, కానీ మీరు మీ భర్త చనిపోయిన తర్వాత కూడా ఆయన సమాధికి కూడా సేవలు చేయడం చూస్తున్న నాకు..మీ పాతివ్రత్యాన్ని ఎలా కొనియాడాలో తెలియట్లేదు'' అన్నాడు. అప్పుడు ఆవిడ, ''నా భర్త చనిపోతూ, నన్నొక కోరిక కోరేడు. కనీసం నా సమాధి ఆరేవరకైనా నీవు మరొక పెళ్ళి చేసుకో వద్దన్నాడు. అందుకే, సమాధి త్వరగా ఆరడం కోసం నేను విసురుతున్నాను.''

ఒక్కసారిగా ఘొల్లున నవ్వేరు పద్మ, నీరజ.

వాళ్ల నవ్వుల ప్రకంపనలతో నిండిపోయింది అక్కడి గాలి కొద్దిసేపు.

తనదైన శైలిలో నవ్వుతూ అంది శ్రీజ, ''ఏ జోక్ ఇండీడ్!''

అయిపోయింది తను ఓడిపోయాడు. నీరసం ఆవహించింది యోగిని.

ఆ హహ్హహ్హహ్హ మొదలుపెట్టేడు. కొద్ది సెకన్ల పాటు పెద్దగా నవ్విన పద్మ, నవ్వుతూనే ..నవ్వు అవరోహణక్రమంలో అంది,

''వండ్రఫుల్ జోక్, అన్నయ్యా! ఈసారి యోగి అన్నయ్యని మా డాడీకి పరిచయం చేయాలి. మా డాడీకి కూడా జోక్స్ అంటే చాలా యిష్టం''

వింటున్న యోగి అదిరిపడ్డాడు. పద్మ తనని అ.. న్న...య్యా అంటుంది!

ఆహ్హహ్హహ్హ..అని నవ్వడం మొదలుపెట్టిన యోగి, పద్మ మాటలు విని, స్టిల్ మోషన్‌లో బొమ్మలాగా..మాటా, చలనం లేకుండా అయోమయంగా చూస్తూ అవాక్కయిపోయాడు! అప్పుడు మొదలైంది ఆ నవ్వు..

''ఆహ్హహ్హహ్హహ్హహ్హ..'' పెద్దగా నవ్వుతుంది, పద్మకాదు, నీరజకాదు శ్రీజ!!

శ్రీజ నవ్వుతోంది!!! నోరు విశాలంగా తెరచి హాయిగా గలగలా ఎటువంటి ఇన్హిబిషన్స్ లేకుండా..పగలబడి నవ్వుతోంది శ్రీజ.

నవ్వుతూనే అంటోంది, ''చూడు నీరజ! మీ అన్నయ్యని..ప్రేమించిన హీరోయిన్ రాఖీ కట్టినప్పటిలా హాస్యాన్ని గ్రేట్ డిసప్పాయింట్‌మెంట్‌నీ ఇంత గొప్పగా ఏ హాస్యనటుడూ చూపించలేడేమో'' శ్రీజ నవ్వుతోంది, నవ్వుతూనే యోగి వైపు చూసి, ''సారీ..అయామ్ సారీ..ఎంతో కంట్రోల్ చేసుకుందామనుకున్నా...'' ఆమె నవ్వుతూనే ఉంది.

శ్రీజ నవ్వడంతో, చేతులను నలభై అయిదు డిగ్రీల యాంగిల్లో మడిచి, పిడికిళ్ళు బిగించి చేతుల్ని కదిలిస్తూ అయ్ గాటిట్..అయ్ గాటిట్ అంటూ అరవబోయిన యోగీంద్ర పిడికిళ్ళు అసంకల్పితంగా విడివడ్డాయి. చేతులు క్రమంగా సాధారణ స్థితికొచ్చాయి. గొంతు పెగల లేదు.

శ్రీజ గలగలా నవ్వినదన్న ఆనందం అతనికి కొద్ది సెకన్లు కూడా దక్కలేదు.

సర్వం కోల్పోయిన ధర్మరాజులా..నిర్వీర్యంగా..నిస్తేజంగా.. నిరాశగా శ్రీజ వైపు చూస్తుండిపోయాడు యోగి.

అతను ఆశపడినట్లు, గలగలా నవ్వుతున్న శ్రీజ, సంపెంగ వాసన అద్దిన కలువలా..మల్లెల వాసన వెదజల్లే వెన్నెలలోని తాజ్‌మహల్‌లా..ఇంద్రధనుస్సు చీర ధరించిన వెన్నెల వధువులా... లేనే లేదు!

నోరు పెద్దగా తెరవడం వలన ఆమె ముఖ కవళికలు, ఎందువల్లనో అందవికారంగా మారిపోయాయి. ఆమెను చూస్తుంటే... తారు పులుముకున్న తాజ్‌మహల్‌లా..పేడ వాసన వెదజల్లే కలువలా..కారు మబ్బులు కమ్మిన ఆకాశంలా అనిపించింది. ఆమె ముఖం చూడలేక తల దించేసుకున్నాడు యోగి.

'ఏరా యోగి, కొండని తవ్వి ఎలుకని పట్టినట్లుందా? ఇంత తిప్పలు పడిన నీకు చివరకు మిగిలింది, డబుల్ డిజప్పాయింట్‌మెంటేగా! పూర్ యోగి!' యోగి అంతరాత్మ యోగిని చూసి వికటాట్టహాసం చేస్తోంది.

*